క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన



తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత



కుట్టుమిషన్లు అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట: ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కనగర్తి గ్రామానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌ను తమకు కుట్టు మిషన్లు అందించాలని గ్రామానికి చెందిన ముగ్గురు మేరు సంఘ సభ్యులు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కుట్టుమిషన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గ్రామానికి చెందిన ఓదెల ప్రకాశ్, ఓదెల శివ, ఓదెల భూమలింగంకు మూడు మిషన్లు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పంపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వంగపెల్లి దేవరాజు, నాయకులు ప్రకాశ్, శంకర్, ముత్తయ్య, శోభన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై శ్రీకాంత్

చందుర్తి: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మల్యాలలో జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈనెల 13న సిరిసిల్లలోని కల్యాణలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 కంపెనీలు వెయ్యికిపైగా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.

రెండ్రోజులు 'భగీరథ' నీరు బంద్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లిలో మిషన్ భగీరథ నీటి పైపు లైన్ లీకేజీతో వేములవాడ రూరల్, మల్యాల, కొడిమ్యాల, బోయినపల్లి, గంగధర, చొప్పదండి మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. తిరిగి 12న భగీరథ నీటిని అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత



వేములవాడరూరల్: మల్లారంలోని దేవతల చెరువు నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కల్వర్టు, పైపులు ధ్వంసమయ్యాయన్నారు.

ఎంపీని కలిసిన సెస్ మాజీ డైరెక్టర్

గంభీరావుపేట: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను మండల సెస్ మాజీ డెరెక్టర్ కొక్కు దేవేందర్ యాదవ్ ఆదివారం కలిశారు. ఢిల్లీలోని సంజయ్ నివాసంలో దేవేందర్‌యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా ఆసరి ఎల్లయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పొట్లపల్లి మహేందర్‌రావు, కొమ్మటిరెడ్డి లచ్చిరెడ్డి, పొట్లపల్లి కిషన్‌రావు, శ్రీనివాస్‌రావు, తాళ్లపెల్లి పాపయ్య, గంగుల బాలకిషన్, దుండ్రపెల్లి బక్కయ్య, ముడికె మల్లయ్య, పొట్ల బాలయ్య ఎన్నికయ్యారు. కార్యక్మంలో కార్యదర్శి నక్క పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో విద్యుదాఘాతంతో మృతిచెందిన ముండ్రాయి సందీప్‌కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అతని స్నేహితులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సందీప్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

ఆధునిక హంగులతో సహకార బంకులు

- 24 గంటలు అందుబాటులో..
- జిల్లాలో 29 సహకార సంఘాల గుర్తింపు
- 13 సహకార బంకుల్లో పనులు
- రిటైల్ ధరలకే పెట్రోల్, డీజిల్ లభ్యం



బందనకల్ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన సహకార పెట్రోల్ బంకు

ముస్తాబాద్: రైతులకు నాణ్యమైన సేవలు అందించడంలో సహకార సంఘాలు (సింగిల్‌విండోలు) ముందుంటున్నాయి. రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాల దగ్గరి నుంచి వారికి ఎప్పుడు ఏ అవసరమున్నా సహకార సంఘాలు అండగా నిలుస్తున్నాయి. 15 ఏళ్ల క్రితం సహకార సంఘాల సేవలను గుర్తించి పెట్రోల్, డీజిల్ బంకులు ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదే సమయంలో నిబంధనలు విధించాయి. దీంతో సహకార సంఘాల పెట్రో బంకులు మూతపడ్డాయి.

రిటైల్ ధరలకే అమ్మకాలు

జిల్లాలో 29 సహకార సంఘాలున్నాయి. ఇందులో 13 సహకార సంఘాల్లో పెట్రో బంకులు ఉన్నాయి. అయితే ఏడాదిక్రితం వరకు కేంద్రప్రభుత్వం, చమురు సంస్థలు వినియోగదారుడి ధరలతోనే పెట్రోలు, డీజిల్‌ను సహకార బంకులకు సరఫరా చేశారు. దీంతో నిర్వహణ భారంగా మారి సహకార బంకులు ఏడాది క్రితం మూతపడ్డాయి. సిబ్బంది వేతనాలు, నిర్వహణ, రవాణా ఖర్చులు మీద పడడంతో సహకార సంఘాలకు పెట్రోలు బంకులు గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలకు కూడా వాణిజ్య బంకులకు అందించినట్లుగా వినియోగదారుడి ధరలపై పెట్రోలు, డీజిల్ సరఫరా చేసేందుకు అంగీకరించింది. దీంతో సహకార సంఘాల బంకులు తెరుచుకున్నాయి. గతంలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే బంకులు పనిచేసేవి. వినియోగదారుడి ధర అమలుచేయడంతో, పెట్రోసంస్థలు బంకులను ఆధునీకరిస్తున్నాయి.

ప్రతి బంకులో నలుగురికి ఉపాధి

గతంలో కన్సూమర్ ధరలకు చమురు సంస్థలు పెట్రో సరఫరా చేయగా, సహకార సంఘాలు నష్టానికి పెట్రోల్, డీజిల్ అమ్మేవారు. ఇప్పుడు రిటైల్ ధర ఇవ్వడంతో ప్రతి లీటర్ అమ్మకాలపై కమిషన్ వస్తుంది. బంకులు రైతులు, ఇతరులకు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ఆధునీకరించడంతో కార్పొరేట్ బంకులకు దీటుగా సంఘాల బంకులను తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ ఆయిల్ చేంజ్ మిషన్, ఏయిర్ కంప్రెషర్, వాష్‌రూమ్స్ లేడీస్, జెంట్స్ ప్రత్యేకంగా ఉంటాయి. ఎలక్ట్రిక్ చార్జింగ్, జనరేటర్ సౌకర్యాలు కల్పిస్తారు. సహకార సంఘాల బంకుల్లో కల్తీకి అవకాశం ఉండదు. సహకార సంఘాల పరిధిలోని యువతకు ఉపాధి దొరుకుతుంది. ప్రతి బంకులో అదనంగా నలుగురికి ఉపాధి లభిస్తుంది.

జిల్లాలో ఆధునీకరించే పెట్రోల్ బంకులివే..

జిల్లాలో పెట్రోల్ బంకులను ఆధునీకరించే వాటిలో పోతుగల్ సహకార సంఘం పరిధిలోని ఆవునూర్, గూడెం, మోహినికుంట, బందనకల్ ఉన్నాయి. అలాగే అల్మాస్‌పూర్ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, నేరెళ్ల, గాలిపల్లి, ఇల్లంతకుంట ఉన్నాయి. పెట్రోలు బంకుల నిర్వహణతో వచ్చే కమిషన్ ఆదాయం సహకార సంఘాల బలోపేతానికి ఊతం కానున్నాయి. సంఘాల బలోపేతంతో రైతులకు మరిన్ని సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

రిటైల్ ధరలకే పెట్రోల్, డీజిల్



సింగిల్‌విండో బంకులకు గతంలో కన్సూమర్ ధరల పైనే పెట్రోలు, డిజిల్ సరఫరా చేశారు. దీంతో సంఘాలకు నష్టం వాటిల్లి, బంకులను మూసివేశాం. ప్రస్తుతం రిటైల్ ధరలకు పెట్రోలు, డీజిల్ సరఫరా చేయడంతో చమురు సంస్థలు బంకులను ఆధునీకరిస్తున్నాయి. రైతులే కాకుండా ఇతరులకు నాణ్యమైన సేవలను సింగిల్‌విండో బంకుల ద్వారా అందిస్తా. రైతులకు అన్ని సేవలను విస్తరిస్తున్నాం.

– తన్నీరు బాపురావు, చైర్మన్, పోతుగల్

బీడీ కార్మికులకు అండగా బీఎల్‌టీయూ



కార్మికులకు స్వీట్లు తినిపిస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

ముస్తాబాద్: బీడీ కార్మికులకు బీఎల్‌టీయూ ఎప్పుడు అండగా ఉంటుందని బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముద్రకొల అంజనేయులు అన్నారు. బీడీ కార్మికులకు, టేకేదార్లకు వేతనాలు పెంచిన సందర్భంగా ముస్తాబాద్ ఏఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు, టేకేదార్లు అతితక్కువ వేతనాలకు పనిచేస్తున్నారన్నారు. ప్రతి రెండేళ్లకోసారి కార్మికుల వేతనాలను పెంచాల్సి ఉందన్నారు. ప్యాకర్లు, బట్టి కార్మికులు, షేకర్లు, బీడీల కట్టలు కట్టె కార్మికులు, టేకేదార్లకు వేతనాలు పెంచేలా యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ఏప్రిల్‌తోనే ఒప్పందం ముగిసిందని, తిరిగి కొత్త ఒప్పందానికి బీడీ కంపెనీల యజమానులతోపాటు, ప్రభుత్వ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయమన్నారు. టేకేదార్లకు రూ.4.50, బీడీ ప్యాకర్లకు రూ. 3650,చాటన్ కార్మికులకు రూ.1700లు పెంచారన్నారు. కార్యక్రమంలో జగదీష్, ప్రభాకర్, బాల్‌రెడ్డి, మహేశ్ , టేకేదార్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



గంభీరావుపేట: సంబరాల్లో పాల్గొన్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో సంబరాల్లో బీజేపీ నాయకులు

గంభీరావుపేట: కేంద్రమంత్రి వర్గంలో బండి సంజయ్‌కు చోటు దక్కినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, పత్తి స్వామి, దేవసాని కృష్ణ, లక్ష్మణ్, సత్యనారాయణ, బుచ్చిబాబు, భాస్కర్, అన్వర్, రమేశ్, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ, మంత్రిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయడంతో మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మహేందర్, కోనేటి సాయిలు, బొమ్మడి స్వామి, కిరణ్నాయక్, చందుపట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం సందర్భంగా బీజేపీ నాయకులు వివేకానంద చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి,స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ పురవీధుల్లో భారీర్యాలీ నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, యెల్ల గిరి, రమేశ్‌రెడ్డి, మీస సంజీవ్, శంకర్, మహేందర్, శ్రీనివాస్‌రావు, నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోయినపల్లి: బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామంలో పోచమ్మ బోనాలను వైభవంగ నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని గూడూరులో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తీరుమారని బస్వాపూర్ వడ్డీ వ్యాపారి

- వడ్డీ చెల్లించలేదని దళితుడిపై దాడి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో అక్రమ వడ్డీ వ్యాపారం సాగుతోందని శుక్రవారం 'అక్రమ వడ్డీలతో అడ్డగోలు వసూళ్లు' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. అయినా పోలీసులు సదరు వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోకపోవడంతో అతను మరింత రెచ్చిపోతున్నాడు. తనను ఎవరూ ఏమి చేయలేరనే ధీమాతో మరింత అధిక వడ్డీ వసూలు చేయడంతోపాటు చెల్లించలేని స్థితిలో ఉన్న వారిపై దాడులకు పాల్పడుతున్నాడు. ఈ వడ్డీ వ్యాపారి లీలలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. గ్రామంలో వడ్డీ వ్యాపారం చేసే సదరు వ్యక్తి, అతని కొడుకు ఇష్టారీతిగా వడ్డీ వసూలు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారంతోపాటు గ్రామంలో కిరాణాదుకాణం ముసుగులో బెల్టుషాపు నిర్వహిస్తున్నారని గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఇటీవల గ్రామానికి చెందిన దళితుడు కర్ని రమేశ్‌పై కూడా కులం పేరుతో దూషిస్తూ సదరు వడ్డీ వ్యాపారి, అతని కొడుకు దాడి చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయాన్ని బాధితుడు రమేశ్ 'సాక్షి'కి మొరపెట్టుకున్నాడు. రూ.5వేలు అప్పుతీసుకున్నందుకు తన ఫోన్ లాక్కోవడంతోపాటు తండ్రీకొడుకులు బూతులు తిడుతూ దాడిచేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు సదరు వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని నారాయణపూర్, రాజన్నపేట, అక్కపల్లి, కోరుట్లపేట, ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట, దుమాల, పదిర, నారాయణపూర్, బండలింగంపల్లి, అక్కపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, కిషునాయక్‌తండా, కోరుట్లపేట, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, దేవునిగుట్టతండా, సింగారం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఇందుకు సహకరించాలని ఏఈ కోరారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



ఎల్లయ్య (ఫైల్)

కోనరావుపేట: ఉపాధికోసం వలసవెళ్లిన ఓవ్యక్తి అక్కడే మృతిచెందగా వారం రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామానికి చేరింది. మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి ఎల్లయ్య (47) ఆరునెలల క్రితం గల్ఫ్‌కు వెళ్లి అక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అక్కడ కంపెనీలో కొద్దిరోజుల వరకు పనిచేసిన ఎల్లయ్య రూంలోనే ఉంటున్నాడు. ఈనెల 3న తోటి మిత్రులు పనికి వెళ్లి వచ్చిచూడగా గది తలుపులు పెట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా ఉరేసుకొని కనిపించాడు. ఎన్నారై గల్ఫ్ విభాగం నాయకుల కృషితో మృతదేహం ఆదివారం గ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు రేహన్ (4) ఉన్నారు.

ఎస్సై విచారణ

ముస్తాబాద్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మైనర్ బాలికను మాయమాటలు చెప్పి ఓ యువకుడు తీసుకెళ్లాడనే ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

రేకులు కూలి పాడిగేదె మృతి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు రేకులు పడి ఓ పాడిగేదె చనిపోయింది. మండల కేంద్ర నివాసి అయిన మహిళా రైతు నాగుల కళావతికి చెందిన పాడిగేదెపై ఈదురుగాలులకు రేకులు పడడంతో చనిపోయింది. ఈ ఘటనలో రైతుకు రూ.70వేల వరకు నష్టం వాటిల్లింది. రైతును మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు, కాంగ్రెస్ మండల యూత్ నాయకులు బుచ్చిలింగు సంతోష్‌గౌడ్, రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి పరామర్శించారు.

చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శ



పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని ఇస్లాంనగర్‌కు చెందిన షేక్ ఇమామ్ ఇటీవల బావుపేట గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తుగా గాయపడ్డాడు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎంపీ డాక్టర్ వాసాల శ్రీనివాస్, షేక్ గౌరేమియా, షేక్ అలీ, సయ్యద్ హైదర్ తదితరులున్నారు.



వేములవాడ: సమావేశమైన 1979–80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేములవాడ: వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో 1979–80లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని కట్టరాజయ్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ఆనందంగా గడిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ప్రతిభ చూపిన ఏ. అక్షితకు రూ.2వేలు, సారియాకు రూ.2 వేలు, క్రాంతికి రూ.వెయ్యి, రాఘవేందర్‌రావుకు రూ.వెయ్యి చొప్పున నగదును పూర్వ విద్యార్థులు అందజేశారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ పాఠశాలలో 2002 – 2003లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశర్మ, జగన్ మోహన్, వేణు, పూర్వ విద్యార్థులు కీసరి అర్జున్, నేరెళ్ల మధు, సాగరం మహేశ్, కర్ణ, శేఖర్, అయ్యప్ప, సాయికృష్ణ, వంశీ, మురళి, శిరీష, సాత్విక, అనూష, శ్రీనిత, స్వాతి, శ్వేత, శ్రావణి తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలోని వాణి నికేతన్ పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాలలో నిర్వహించారు. 40 పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకొని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మం, కనకయ్య, సత్యం, భూపతి, అనురాధ, అరుణ, అరుంధతి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడఅర్బన్: సమావేశమైన పూర్వ విద్యార్థులు



సాగుకు సన్నద్ధం..

కోనరావుపేట: మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాలు పడుతుండడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలు దున్నడం, విత్తనాలు విత్తడం, తదితర పనులు మొదలు పెడుతున్నారు. మండలంలో రెండు రోజులు వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి.



చిన్నారుల జలకాలాట

వేములవాడ: వేసవి సెలవులు, మండుతున్న ఎండలతో చిన్నారులు స్విమ్మింగ్‌పూల్ బాట పడుతున్నారు. వేములవాడ పట్టణంలోని కోనాయపల్లి రోడ్డులో బీమేశ్వర గార్డెన్ ఆవరణలో స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారులు ఈత నేర్చుకుంటూ సరదాగా గడుపుతున్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన గురు దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి పట్టణానికి చెందిన పలువురు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ వారితో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు.

మృతుల కుటుంబాలకు బియ్యం వితరణ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో బాధిత కుటుంబాలకు బీజేపీ నాయకులు ఆదివారం బియ్యం వితరణగా అందించారు. ఇటీవల బొబ్బిలి బాలనర్స్, ఈర్ల సరిత మృతిచెందగా, బాధిత కుటుంబాలకు క్వింటాల్ బియ్యం అందించారు. కోల కృష్ణ, చీకోటి మహేశ్, నాంపెల్లి కనుకయ్య, భిక్షపతి, వెంకటేశ్, రంజిత్, వినయ్, మధు తదితరులున్నారు.